సాక్షి
కర్నూలు
శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళావేదికపై సికింద్రాబాద్‌కు చెందిన లక్ష్మీ గణపతి కల్చరల్ ఆర్గనైజేషన్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



ఖరీఫ్‌కు మరింత 'పవర్'

వచ్చే ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ బోర్లకు నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విద్యుత్ లైన్ సామర్థ్యాన్ని రూ.15 కోట్లతో పెంచుతున్నారు. IIలో▸



వందే జగన్మాత!

అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా దేవికి శుక్రవారం కుంభోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం సర్వం సిద్ధం చేసింది. IIలో▸

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఏపీఆర్‌జేసీ పరీక్ష

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ గురుకుల కాలేజీల్లో ప్రవేశాల కోసం గురువారం నిర్వహించిన ఏపీఆర్‌జేసీ, డీసీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జూనియర్, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పరీక్షలకు 29 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జూనియర్ కాలేజీ విభాగంలో ఎంపీసీ గ్రూప్‌లో 3,961 మందికిగాను 3,501 మంది హాజరుకాగా 460 మంది గైర్హాజరయ్యారు. ఎంపీసీ(ఉర్దూ మీడియం)లో 7 మందికిగాను ఐదుగురు హాజరయ్యారు. బైపీసీ గ్రూప్‌లో 2251 మందికిగాను 1835 మంది హాజరుకాగా 416 మంది గైర్హాజరయ్యారు. ఎంఈసీ గ్రూప్‌లో 451 మందికిగాను 336 మంది హాజరు కాగా 115 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీ కాలేజీల ప్రవేశాల పరీక్షకు బీఏకి 39 మందికిగాను 29 మంది, బీకామ్‌కు 106 మందికిగాను 80, బీఎస్సీ(ఎంపీసీ)కి 54 మందికిగాను 40 మంది, ఎంఎస్‌సీఎస్ గ్రూప్‌కు 25 మందికిగాను 23 మంది హాజరైనట్లు గురుకుల స్కూళ్ల, కాలేజీల కో–ఆర్డినేటర్ డా.జయం శ్రీనివాస గుప్తా తెలిపారు. అలాగే గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, 6వ తరగతి, 7 ఏడు తరగతలకు మిగిలిపోయిన సీట్ల ప్రవేశాల కోసం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. 27 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు మొత్తం 6,459 మంది విద్యార్థులకుగాను 5,029 మంది హాజరుకాగా 1,430 మంది గైర్హాజరయ్యారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సుధీర్ ప్రేమ్ కుమార్

కర్నూలు కల్చరల్: విద్యార్థులు ఉపాధి అవకాశాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం వర్సిటీ సెనేట్ హాల్‌లో ఉన్నత విద్యారంగంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి విద్యార్థి తనను తాను తీర్చిదిద్దుకున్నప్పుడే ప్రస్తుత పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడం సాధ్యమవుతుందన్నారు. విషయ అవగాహనతో పాటు నైపుణ్యాలను పెంచుకోవలసిన అవసరం ఉందన్నారు. హైదరాబాదులోని సెంటర్ ఆఫ్ రీసెర్చ్ స్కీమ్స్ అండ్ పాలసీస్ కన్సల్టెంట్ ఎ.నగేష్ బాబు విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ అవకాశాలను గురించి అవగాహన కల్పించారు.

'ఓపెన్' ఫలితాలు విడుదల

కర్నూలు (సిటీ): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షా ఫలితాలను గురువారం పాఠశాల విద్య కమిషనర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. 10వ తరగతి పరీక్షలకు 1,344 మంది హాజరు కాగా153 మంది , ఇంటర్మీడియట్ పరీక్షలకు 2,246 మంది హాజరుకాగా 538 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పరీక్షల్లో రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు మే 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి. మార్కులు పెంచుకునేందుకు ఈ నెల 29 నుంచి వచ్చే నెల 4వ తేదీ లోపు ఫీజులు చెల్లించాలి. ఫీజులు చెల్లించిన వారికి జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ తెలిపారు.

ఓరి నాయనో.. ఇవేం ఎండలు!

- డోన్, బనగానపల్లెల్లో 45.6 డిగ్రీల ఉష్ణోగ్రత
- రానున్న రెండు, మూడు రోజుల్లో మరింత పెరిగే ప్రమాదం

కర్నూలు(అగ్రికల్చర్): ఎండలు, వడగాడ్పుల తీవ్రతతో ఉమ్మడి కర్నూలు జిల్లా నిప్పుల కొలిమిని తలపిస్తోంది. సాధారణం కంటే 2–4 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వడగాడ్పుల తీవ్రతకు వృద్ధులు, బాలింతలు, చిన్న పిల్లలు, వ్యాధిగ్రస్తులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గత ఏడాది వేసవితో పోలిస్తే ఈ వేసవి ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. గురువారం అత్యధికంగా డోన్, బనగానపల్లిలో 45.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. చాగలమర్రిలో 45.3, నందికొట్కూరులో 44.3, బండిఆత్మకూరులో 44.3, మంత్రాలయంలో 44.2, కోడుమూరులో 44.2, మహానందిలో 44.1, కర్నూలులో 43.7, కౌతాళం 43.1, గూడూరులో 43.1 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం సమయంలో వడగాడ్పుల తీవ్రత వల్ల రహదారుల్లో రాకపోకలు పూర్తిగా స్తంభిస్తున్నాయి. రానున్న రెండు, మూడు రోజుల్లో ఉష్ణోగ్రతల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన జిల్లా ప్రజలకు సూచించారు.

తొలి ఘట్టం ముగిసింది

- జిల్లాలో 183 మంది అభ్యర్థుల నామినేషన్లు
- కర్నూలు పార్లమెంట్‌కు 41, అసెంబ్లీ నియోజకవర్గాలకు 241 నామినేషన్ల స్వీకరణ
- చివరి రోజు 93 మంది అభ్యర్థులు 99 నామినేషన్ల దాఖలు
- నేడు ఆర్వో కార్యాలయాల్లో అభ్యర్థుల సమక్షంలో స్క్రూటినీ



కర్నూలులో నామినేషన్ల కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఉత్సాహం (ఫైల్)

కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికల్లో తొలి ఘట్టం ముగిసింది. ఎన్నికల్లో అత్యంత కీలకమైన నామినేషన్ల ప్రక్రియకు గురువారంతో తెరపడింది. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు కర్నూలు పార్లమెంట్ స్థానంతోపాటు కర్నూలు, పాణ్యం, కోడమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల కోసం అధికారులు నామినేషన్లను స్వీకరించారు. ఏడు రోజుల్లో మొత్తం 183 మంది నుంచి 282 నామినేషన్లను స్వీకరించారు. అందులో కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి 28 మంది అభ్యర్థులు 41, 8 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 155 మంది 241 నామినేషన్లను దాఖలు చేశారు.

అత్యధికంగా కర్నూలు నుంచే..

కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి అత్యధికంగా అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీలైన వైఎస్సార్‌సీపీ, టీడీపీతోపాటు చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 56 నామినేషన్లను దాఖలు చేశారు. అత్యల్పంగా మంత్రాలయం నియోజకవర్గం నుంచి 13 మంది 17 నామినేషన్లు వేశారు. అత్యధికంగా నామినేషన్లు వేసిన నియోజకవర్గాల్లో పాణ్యం రెండో స్థానంలో ఉంది. ఇక్కడ 23 మంది అభ్యర్థులు 37 నామినేషన్లను దాఖలు చేశారు. మూడో స్థానంలో కోడుమూరు నిలిచింది.

చివరిరోజు పోటెత్తిన నామినేషన్లు

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల స్వీరణకు చివరి రోజు ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో నిలిచేందుకు మొగ్గు చూపారు. ఏకంగా 93మంది అభ్యర్థులు 99 నామినేషన్లను దాఖలు చేశారు. కర్నూలు పార్లమెంట్‌కు 12 మంది 12 నామినేషన్లను దాఖలుచేయగా, కర్నూలు, పాణ్యం, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల నుంచి 81 మంది అభ్యర్థులు 87 నామినేషన్లను దాఖలు చేశారు.



సీఎం జగన్ ఫ్లెక్సీతో అభిమాని (ఫైల్)

నేడు ఆర్వో కార్యాలయాల్లో స్క్రూటినీ

నామినేషన్ల పరిశీలన కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టనున్నారు. ఇందుకోసం అన్ని ఆర్వో కార్యాలయాల్లో ఏర్పాట్లు చేశారు. స్క్రూటినీ ప్రక్రియలో అభ్యర్థులు, వారిని ప్రతిపాదించినవారు పాల్గొనవచ్చు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలు మేరకు నామినేషన్లలో అభ్యర్థులు పొందు పరచిన వివరాలు సక్రమంగా లేకపోతే తిరస్కరించే అవకాశం ఉంటుంది. ఈ నెల 27, 29 తేదీల్లో ఏదైనా కారణం చేత నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. 29న పోటీలో ఉండే తుది జాబితా అభ్యర్థులను ప్రకటిస్తారు.

నియోజకవర్గం	అభ్యర్థుల సంఖ్య	నామినేషన్ల సంఖ్య
కర్నూలు (ఎంపీస్థానం)	28	41
కర్నూలు	40	56
పాణ్యం	23	37
పత్తికొండ	14	24
కోడుమూరు	20	31
ఎమ్మిగనూరు	15	28
మంత్రాలయం	13	17
ఆదోని	15	23
ఆలూరు	15	25
మొత్తం	183	282

స్క్రూటినీ జాగ్రత్తగా చేపట్టాలి

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియను జాగ్రత్తగా చేపట్టాలని రిటర్నింగ్ అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్‌జి.సృజన ఆదేశించారు. గురువారం రాత్రి టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆమె ఆర్వోలతో సమీక్షించారు. స్క్రూటినీ ప్రక్రియను వీడియోగ్రఫీ తీయించాలని, సీసీ కెమెరాలు ఉంటే ఆడియో, వీడియో సక్రమంగా పనిచేసేలా చసుకోవాలన్నారు. ఈ ప్రక్రియను ఎన్నికల అబ్జర్వర్ల పర్యవేక్షణలో సాగించాలని సూచించారు. ఈనెల 27వ తేదీన ఈవీఎంల ర్యాండమైజేషన్ రెండో విడత ప్రక్రియను ఎన్నికల అబ్జర్వర్ల సమక్షంలో చేపట్టాలన్నారు. మే 5 నుంచి 8వ తేదీ వరకు అన్ని నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్‌ను నిర్వహించాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఓటు ఉన్న వారికి పోస్టల్ బ్యాలెట్ నిర్వహించబోమని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. హోం ఓటింగ్ కోసం మే 6, 7, 8 తేదీల్లో ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో ఆర్వోలు నారపురెడ్డి మౌర్య, భార్గవ్‌తేజ, శివ నారాయణ శర్మ, ఎం.శేషిరెడ్డి, రామలక్ష్మి, చిరంజీవి, మురళీ పాల్గొన్నారు.

చివరి రోజు నామినేషన్లు వేసిన వారు...

- పత్తికొండలో చివరి రోజు ఎనిమిది మంది అభ్యర్థులు 8 సెట్ల నామినేషన్లను ఆర్వో రామలక్ష్మికి అందించారు. వైఎస్‌ఆర్‌సీపీ తరఫున కంగాటి శ్రీదేవి(అదనపు సెట్), టీడీపీ తరపున కేఈ శ్యామ్ బాబు, కేఈ హరిబాబు నామినేషన్లను వేశారు.
- ఆదోని నుంచి 9 మంది అభ్యర్థులు 9 సెట్ల నామినేషన్లను దాఖలుచేశారు. వైఎస్‌ఆర్‌సీపీ తరపున వై.సాయిప్రసాద్‌రెడ్డిని బలపరుస్తూ ఆయన తనయుడు వై.జయ మనోజ్‌రెడ్డి మూడో సెట్ నామినేషన్‌ను వేశారు.
- కోడుమూరు నుంచి 8 మంది అభ్యర్థులు 8 సెట్ల నామినేషన్లు వేశారు. ఆదిమూలపు సతీష్ తరపున మరో సెట్ నామినేషన్‌ను సలీమీయ్యా వేశారు.
- పాణ్యం నుంచి 14 మంది 15 నామినేషన్లను దాఖలు చేశారు. వైఎస్‌ఆర్‌సీపీ నుంచి కాటసాని రాంభూపాల్‌రెడ్డి తరపున మరోసెట్ నామినేషన్‌ను కాటసాని దేదీప్య రాణిక దాఖలు చేశారు. అలాగే వైఎస్‌ఆర్‌సీపీ తరపున కాటసాని శివనరసింహారెడ్డి, తెలుగుదేశంపార్టీ తరపున గౌరు వెంకటరెడ్డి రెండు సెట్లు, గౌరు చరితారెడ్డి మరోసెట్ నామినేషన్లను దాఖలు చేశారు.
- ఎమ్మిగనూరు నుంచి తొమ్మిది అభ్యర్థులు తొమ్మిది సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. టీడీపీ తరపున జయనాగేశ్వరరెడ్డి, బైరెడ్డి నిత్యాదేవి వైఎస్‌ఆర్ సీపీ నుంచి బుట్టా శివ నీలకంఠ నామినేషన్లను ఆర్వోకు అందించారు.
- ఆలూరులో గురువారం 9 మంది అభ్యర్థులు 10 నామినేషన్లను దాఖలు చేశారు. వైఎస్‌ఆర్‌సీపీ అభ్యర్థి బి.విరూపాక్షి రెండుసెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. టీడీపీ తరపున బి.వీరభద్రగౌడ్ నామినేషన్ వేశారు.
- కర్నూలు అసెంబ్లీ స్థానానికి చివరిరోజు 17 మంది 21సెట్ల నామినేషన్‌లను దాఖలు చేశారు. టీడీపీ తరపున టీజీ భరత్ రెండు, కాంగ్రెస్ తరపున షేక్ జిలానీ బాషా నాలుగు సెట్ల నామినేషన్లు వేశారు.
- మంత్రాలయంలో మొత్తం ఏడుగురు అభ్యర్థులు ఏడు నామినేషన్లను దాఖలు చేశారు. కాంగ్రెస్ నుంచి మురళీకృష్ణరాజు, టీడీపీ నుంచి ఎన్. రాఘవేంద్రరెడ్డి, యశోదమ్మ నామినేషన్లను వేశారు.
- కర్నూలు పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ తరపున రాంపుల్లయ్య యాదవ్ అదనపు సెట్, కాంగ్రెస్ తరపున సయ్యద నవీద్, పీర్ ఖాద్రి, టీడీపీ తరపున నాగరాజు మరోసెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు.





మేమంతా మీ వెంటే..

ఎస్పీపీఐ ఆధ్వర్యంలో గురువారం హొళగుంద ఈబీసీ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ అభ్యర్థి విరూపాక్షి, కార్యక్రమానికి భారీగా హాజరైన ముస్లింలు, మహిళలు -హొళగుంద

హద్దు మీరితే బైండోవరే!

- జిల్లాలో ఇప్పటివరకు 6,400 మందిపై బైండోవర్
- వీరిలో సగం మందిపై రౌడీ, సస్పెక్ట్ షీట్లు
- బైండోవర్లలో యువకులదే అగ్రస్థానం
- తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు

కర్నూలు: సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడానికి పోలీసు శాఖ జాగ్రత్తలు తీసుకుంటోంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై దృష్టి సారించింది. కొందరిని బైండోవర్ చేయడంతో పాటు అనుమానితులకు హెచ్చరికలు జారీ చేస్తోంది. ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పటిష్ట చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే బైండోవర్ (బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్) చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలు నాటి నుంచి పోలీసులు బైండోవర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా గొడవల్లో పాల్గొన్న వారు, అనుమానితులపై ఈ చర్యలు తీసుకుంటున్నారు. వారి నుంచి హామీ పత్రంతో పాటు రూ.2 లక్షలకు బాండ్ ఆధారంగా బైండోవర్ చేస్తున్నారు. అసలు బైండోవర్ అంటే ఏంటి? దీని కింద ఎవరిపై చర్యలు తీసుకుంటారో తెలుసుకుందాం...

అతిక్రమిస్తే బౌండ్ డౌన్...

బాండులో రాసిచ్చిన హామీని అతిక్రమిస్తే దానిని బౌండ్ డౌన్ అంటారు. బాండ్ రాసి ఇచ్చిన రోజు నుంచి ఆరు మాసాల వరకు నేరాలకు పాల్పడకూడదు. ఏదైనా నేరం చేసినా... వారిపై కేసు నమోదైనా పోలీసులు 24 గంటల్లో అరెస్టు చేస్తారు. ఇచ్చిన హామీ ప్రకారం బాండ్‌లో పేర్కొన్న మొత్తాన్ని సదరు వ్యక్తుల నుంచి వసూలు చేసి ప్రభుత్వ ఖజానాకు పంపిస్తారు. బైండోవర్ పత్రాలు ఆరు మాసాల పాటు పోలీసుల దగ్గరే ఉంటాయి.

ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హులే...

ఒకటి, రెండు, అంతకంటే ఎక్కువసార్లు తహశీల్దార్ల ఎదుట హాజరైన వ్యక్తులపై రౌడీషీట్ తెరవచ్చు. షీట్ తెరవాలని సంబంధిత స్టేషన్ సీఐ ప్రతిపాదనను డీఎస్పీకి సిఫారసు చేస్తారు. ఒక్కసారి తెరిస్తే ప్రభుత్వ ఉద్యోగానికి అనర్హులవుతారు. పాస్‌పోర్టు లభించదు. వారు ఉండే ప్రాంతాల్లో ఏదైనా అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు, ఘర్షణలు జరిగితే షీట్ ఉన్న వ్యక్తులను పిలిపించి విచారిస్తారు. ప్రస్తుతం జరుగుతున్న బైండోవర్లలో యువతనే అగ్రస్థానంలో ఉండటం గమనార్హం. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.



పోలీసు సూచనలు ఇవీ....

ఎన్నికల వేళ యువత మరిన్ని జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. అభిమాన నాయకులు పిలిచారని బైకు ర్యాలీల్లో పాల్గొనడం, ప్రత్యర్థులతో ఘర్షణకు దిగడం వంటివి ఎంతమాత్రం సరికాదని హెచ్చరిస్తున్నారు. అలా వ్యవహరిస్తే బైండోవర్ తప్పదని, చేసిన తప్పునకు ఏళ్ల తరబడి స్టేషన్ల చుట్టూ తిరగడంతో పాటు కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తుందంటున్నారు. అటువంటివారిపై ఏ ఎన్నికలు వచ్చినా ముందుగా బైండోవర్ చేస్తుంటారు. వారి సమీపంలో ఎటువంటి అసాంఘిక, హింసాత్మక సంఘటనలు జరిగినా వారు స్టేషన్‌కు రావాల్సిందే. పోలీసు అధికారులు మారినా, వారిపై పడిన ముద్ర అలాగే ఉంటుంది.

బైండోవర్ చేసిన వారిలో వయసుల వారీగా ఇలా...

వయసు	సంఖ్య
18 నుంచి 25 ఏళ్ల లోపు వారు	2,016 మంది
26 నుంచి 30 ఏళ్ల లోపు వారు	2,456 మంది
31 నుంచి 35 ఏళ్ల లోపు వారు	1,636 మంది
35 నుంచి 45 ఏళ్ల లోపు వారు	292 మంది

బైండోవర్ అంటే..

శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారు, గొడవ లు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను ఎన్నికల సమయంలో మద్యం, బెల్టు షాపుల నిర్వాహకులు, రౌడీషీటర్లను సంబంధిత తహశీల్దార్ ఎదుట పోలీసులు హాజరుపరుస్తారు. ఒక్కొక్కరితో రూ.2 లక్షలకు బాండ్ పేపర్ రాయించుకుంటారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడబోమని లిఖితపూర్వకంగా హామీ తీసుకుంటారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేస్తారు. ఈ ప్రక్రియ సత్ప్రవర్తనకు హామీ (బైండోవర్) అంటారు. గుంపుగా దాడికి పాల్పడినా, శాంతి భద్రతలకు భంగం కలిగించినా తహశీల్దార్ లేదా ఆర్‌డీఓ (నేరాన్ని బట్టి) ఎదుట పోలీసులు హాజరుపరుస్తారు. బైండోవర్ తర్వాత వ్యక్తి ప్రవర్తనలో మార్పు రాకపోతే జైలుకు పంపించే అధికారం పోలీసులకు ఉంటుంది.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు



సయ్యద్ అలీఖాన్ (99.932 పర్సెంటైల్)



వేదవ్యాస్ (99.918 పర్సెంటైల్)



జ్యోతిరాదిత్య (99.913 పర్సెంటైల్)



కోడూరు తేజేశ్వర్ (99.901 పర్సెంటైల్)

కర్నూలు సిటీ: జాతీయ స్థాయిలో పేరొందిన విద్యా సంస్థల్లో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించేందుకు నిర్వహించిన జేఈఈ మెయిన్ సెషన్– 2 పరీక్ష ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బుధవారం అర్ధరాత్రి ప్రకటించింది. ఈ ఫలితాలలో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు సత్తా చాటారు. జేఈఈ మెయిన్ మొదటి సెషన్ పరీక్షలు ఈ ఏడాది జనవరి 28 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నిర్వహించగా 2,568 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ ఫలితాలు ఫిబ్రవరి 13వ తేదిన వచ్చాయి. రెండో సెషన్ పరీక్షలు ఈ నెల 4 నుంచి 12వ తేదీ వరకు జరిగాయి. మొదటి, రెండో సెషన్స్‌లలో జరిగిన పరీక్షలకు హాజరైన వారి మార్కులలో ఎక్కువ మార్కులు వచ్చిన వాటిని తీసుకొని పర్సెంటైల్‌ను లెక్కించి ర్యాంకులు ప్రకటించారు. ఇందులో జిల్లాకు చెందిన విద్యార్థులు ఉత్తమ పర్సెంటైల్ సాధించారు. సయ్యద్ అలీఖాన్ 99.932, వేదవ్యాస 99.918, జ్యోతిరాదిత్య 99.913, కోడూరు తేజేశ్వర్ 99.901, పి.ప్రణీత్‌రెడ్డి 99.774, ఎస్.సాఖిత సాయి మణికంఠ 99.715, సాఖిత రాము 99.621, డి.నోయల్ తన్యా 98.966, ప్రతాప్ ఉమా లిఖిస్ 98.75లతో పాటు మరికొంత మంది ఉత్తమ పర్సెంటైల్ సాధించారు.

27 నుంచి అడ్వాన్స్‌డ్‌కు దరఖాస్తు

జేఈఈ మెయిన్‌లో కటాఫ్ మార్కుల సాధించిన విద్యార్థులకు అడ్వాన్డ్స్ పరీక్షలు రాసేందుకు అవకాశం కలుగుతుంది. ఈ పరీక్షకు ఈ నెల 27 నుంచి మే నెల 7వ తేది వరకు ఐఐటీ మద్రాసు దరఖాస్తులను స్వీకరించనుంది. మే 17 నుంచి 26 వరకు అడ్వాన్స్ పరీక్షల అడ్మిట్ కార్డులు అందుబాటులో ఉంటాయి. మే 26 నుంచి ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్–1 , మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 పరీక్ష నిర్వహించనున్నారు. ఫలితాలను జూన్ 9న ప్రకటించనున్నారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల ఐఐటీ–నీట్ అకాడమీ విద్యార్థులు జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో సత్తా చాటారు. ఈ అకాడమిలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన గ్రామీణ విద్యార్థులు ఇంటర్మీడియట్‌తో పాటు ఐఐటీ–నీట్ పరీక్షలకు శిక్షణ పొందుతున్నారు. ఈ ఏడాది 76 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 73 మంది విద్యార్థులు ఎన్‌టిఏ వారు నిర్వహించిన జాతీయ స్థాయి జెఈఈ మెయిన్స్ పరీక్ష ఉత్తీర్ణత సాధించి జెఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించినట్లు అకాడమీ డైరెక్టర్ డి.రామసుబ్బారెడ్డి గురువారం విలేకరులకు తెలిపారు. 14 మంది విద్యార్థులు 90 పర్సెంటైల్ పైన సాధించారు.



విద్యార్థి పేరు: వి.సంతోష్,
పర్సెంటైల్: 98.75, జాతీయ స్థాయిలో క్యాటగిరీ ర్యాంక్–499
తల్లిదండ్రులు: వెంకట రమణ, అరుణ,
స్వస్థలం: మదనపల్లె, అన్నమయ్య జిల్లా,
లక్ష్యం: ముంబాయి ఐఐటీలో చదవడం



విద్యార్థి పేరు: బి. గురు ప్రసాద్
పర్సెంటైల్: 97.71, జాతీయ స్థాయిలో క్యాటగిరీ ర్యాంక్–1007
తల్లిదండ్రులు: వాసుదేవయ్య, సరస్వతి
స్వస్థలం: మదనపల్లె, అన్నమయ్య జిల్లా
లక్ష్యం: ముంబాయి ఐఐటీలో చదవడం



విద్యార్థి పేరు: ఎస్.నరేంద్ర
పర్సెంటైల్: 96.71, జాతీయ స్థాయిలో క్యాటగిరీ ర్యాంక్–1638
తల్లిదండ్రులు: ఎల్లయ్య, మహేశ్వరి
స్వస్థలం: రత్నపల్లె, వెల్దుర్తి మండలం, కర్నూలు జిల్లా
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం



విద్యార్థి పేరు: ఎం. అభిషేక్
పర్సెంటైల్: 96.12, జాతీయ స్థాయిలో క్యాటగిరీ ర్యాంక్–2033
తల్లిదండ్రులు: అమోస్, దేవమ్మ
స్వస్థలం: సోమల గూడూరు, నందవరం మండలం, కర్నూలు
లక్ష్యం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



విద్యార్థి పేరు: ఎస్.ఆదరణకుమార్
పర్సెంటైల్: 95.09, జాతీయ స్థాయిలో క్యాటగిరీ ర్యాంక్: 2752
తల్లిదండ్రులు: యేసు, సంతోషమ్మ
స్వస్థలం: కొత్తకోట, సీ.బెళగల్ మండలం, కర్నూలు **లక్ష్యం:** ఐఐటీ బొంబాయిలో చదవడం

క్లుప్తంగా

ప్రశాంత పోలింగ్‌కు చర్యలు

- కర్నూలు రేంజ్ డీఐజీ విజయారావు



పోలీంగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కర్నూలు రేంజ్ డీఐజీ విజయారావు

ఆళ్లగడ్డ: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రశాంత పోలింగ్‌కు పోలీసు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కర్నూల్ రేంజ్ డీఐజీ విజయారావు ఆదేశించారు. గురువారం ఆయన ఎన్నికల ప్రత్యేక పోలీస్ అధికారి హిమాన్సూ శంకర్ త్రివేది కలసి స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఎన్నికల బందోబస్తుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నిబంధనల మేరకు శాంతిభద్రతకు విఘాతం కలుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆరా తీశారు. బైండోవర్, పోలీస్ కవాతు, వంటి వాటిపై సమీక్షించారు. ప్రజలను తమ ఓటు హక్కును ప్రశాంతగా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధులను నిష్పాక్షపాతంగా నిర్వహించాలన్నారు. వీరి వెంట ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఎస్పీ షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



ఓఆర్‌ఎస్ ప్యాకెట్ వాడకాన్ని వివరిస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఓఆర్‌ఎస్ ద్రావణం వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరిగినందువల్ల ప్రజలు వడదెబ్బకు, డీ హైడ్రేషన్‌కు గురిగాకుండా స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువ ఉన్న సమయంలో ఎండలో తిరగకుండా ఉండాలని, తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలో వెళ్లాల్సి వస్తే గొడుగు/టోపీ వాడాలన్నారు. పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంగా ఉన్న వారు, గర్భిణులు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రోజుకు కనీసం ఐదు లీటర్ల నీటిని తాగడం, కొబ్బరినీళ్లు, మజ్జిగ, పళ్లరసాలు, ఓఆర్‌ఎస్ ద్రావణం తాగుతూ ఉండాలన్నారు. ఇంటిలో కిటికీలకు తడిబట్ట కట్టడం ద్వారా చల్లని గాలి వస్తుందన్నారు. వీధుల్లో, రోడ్లపై అమ్మే శీతలపానియాలు తాగరాదన్నారు. వడదెబ్బతో మరణించిన వారి మరణాన్ని ధ్రువీకరించేందుకు ప్రభుత్వ అధికారులైన తహసీల్దార్, పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్, వైద్యాధికారితో కూడిన త్రిసభ్య కమిటీ ఉంటుందన్నారు. వడదెబ్బతో వ్యక్తి మరణించిన గంటలోపు కమిటీ సభ్యులకు తెలపాలని, కమిటీ సభ్యులు సంబంధిత ఆసుపత్రి నిర్వాహకులతో పోస్టుమార్టం నిర్వహించి వడదెబ్బ కారణం చేతనే వ్యక్తి మరణించాడని ధ్రువీకరించిన పత్రాన్ని కుటుంబీకులు అర్జీతో జతపరిచి జిల్లా విపత్తు నివారణ శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

వందే జగన్మాత!

- నేడు శ్రీశైల భ్రామరీకి కుంభోత్సవం
- అమ్మవారి మూలవిరాట్ దర్శనం
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం
- సాత్వికబలిగా సమర్పించనున్న గుమ్మడికాయలు, కొబ్బరికాయలు



శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రంలో వెలసిన శ్రీభ్రమరాంబా దేవికి శుక్రవారం కుంభోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం సర్వం సిద్ధం చేసింది. ఆలయ సంప్రదాయ ఆచారాల్లో భాగంగా పూర్వం చెంచులకు అతి ముఖ్యమైన ఉత్సవం. కాలక్రమేణా ఇప్పుడు అందరి ఉత్సవంగా ఊరి పండుగగా మారింది. ఆనవాయితీలో భాగంగా ఉగాది పండుగ అనంతరం మొదటి పౌర్ణమి తర్వాత వచ్చే మంగళ, శుక్రవారాల్లో ఈ కుంభోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ మేరకు ఈనెల 26వ తేదీన ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు శ్రీ భ్రమరాంబా ఆలయాన్ని మూసివేసి, కాల పూజలు మాత్రమే నిర్వహిస్తారు. సాయంత్రం చంద్రోదయం తర్వాత ఆలయాన్ని తెరిచి అమ్మవారికి కేవలం పసుపు, కుంకుమతో పూజిస్తారు. అమ్మవారి గర్భాలయం తెరిచేటప్పటికీ విగ్రహానికి ఎదురుగా ముఖ మండపంలోని శక్తి యంత్రం వెనకాల అన్నాన్ని రాసిగా పోసి అన్నకూకోట్సతవం నిర్వహిస్తారు. పూర్వం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో హరిహరరాయ గోపురం వద్ద ప్రాకారంపై ఉన్న మహిషాసురమర్ధిని అమ్మవారికి (కోటమ్మవారికి) ప్రత్యేక పూజాదికాలను జరిపించి కోళ్లు, మేకలను కుంభోత్సవం రాత్రి బలిచ్చేవారు. కాల క్రమేణా స్వాతిక బలిదిశకు ఈ ఉత్సవం చేరుకుంది. ప్రస్తుతం వేలకొద్ది నిమ్మకాయలు, గుమ్మడికాయలు, కొబ్బరి కాయలు అమ్మవారికి సమర్పిస్తారు. దాదాపు 6వ శతాబ్దంలో సాక్షాత్తూ ఆదిశంకరాచార్యులు వామాచార (బలుల) సంప్రదాయానికి స్వస్తి చెబుతూ దక్షిణాచార (సాత్వికబలి) సంప్రదాయాన్ని కొనసాగేలా అమ్మవారి ఉగ్రరూపాన్ని ఉపసంహరించి శ్రీచక్రాన్ని ఏర్పాటు చేశారని ఆలయ చరిత్ర చెబుతోంది.

ఏడాదిలో ఒక్క రోజే నిజరూప దర్శనం..

కుంభోత్సవం రోజు మాత్రమే అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుంది. ఎనిమిది చేతులలో వివిధ ఆయుధాలను ధరించి ఉన్న భ్రమరాంబాదేవి వారు రోజూ అలంకారమూర్తిగా దర్శనమిస్తారు. అమ్మవారికి స్వర్ణముఖకవచం అలంకరింపబడి ఉంటుంది. అయితే సంవత్సరంలో ఒక్క కుంభోత్సవం రోజున మాత్రమే అమ్మవారి ముఖానికి కవచాలంకరణ ఉండదు. ఆ రోజున భక్తులు అమ్మవారి నిజరూప దర్శనాన్ని చేసుకోవచ్చు. కుంభోత్సవాన్ని పురస్కరించుకుని స్థానికులందరు అమ్మవారిని దర్శించుకుంటారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయం అంతా పలురకాల పుష్పాలతో, నిమ్మకాయల దండలతో, వేపమండలతో అలంకరిస్తారు. శ్రీశైలంలో నివసించే స్థానికులందరూ ఈ ఉత్సవాన్ని తమ ఊరిపండుగగా భావిస్తారు. సంప్రదాయాన్ని అనుసరించి స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతిని సమర్పిస్తాడు. అనంతరం రెండోవిడత సాత్వికబలిని సమర్పిస్తారు. తరువాత భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలను చేసి తొమ్మిది రకాల పిండివంటలతో మహానివేదన చేస్తారు. కుంభోత్సవ ఉత్సవాలల్లో భాగంగా సాయంత్రం స్వామివారి ప్రదోషకాల పూజల అనంతరం స్వామివారికి అన్నాభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ద్వారాలు మూసివేయబడతాయి.





అమ్మవారికి సాత్వికబలి సమర్పించేందుకు సిద్ధం చేసిన నిమ్మకాయలు, గుమ్మడికాయలు

కుంభోత్సవం ఎందుకు చేస్తారంటే..

అమ్మవారు లోకాన్ని చల్లగా చూసేందుకు లోకకల్యాణం కోసం కుంభోత్సవం నిర్వహిస్తారు. అతివృష్టి, అనావృష్టి నివారించబడి సకాలంలో తగినంత వర్షాలు పడేందుకు, పంటలు బాగా పండేందుకు, ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండేందుకు, అంటువ్యాధులు ప్రబలకుండా, చిన్నపిల్లలకు తట్టు, అటలమ్మ తదితర వ్యాధులు సోకకుండా ఉండేందుకు, భూతాలు, పిశాచాలు, ప్రేతాలు జనులను పీడించకుండా ఉండేందుకు కుంభోత్సవం నిర్వహిస్తారు.



నిమ్మకాయ మాలలు చుడుతున్న మహిళలు

సంప్రదాయబద్ధంగా కుంభోత్సవం

శ్రీశైల మహాక్షేత్రంలో శుక్రవారం నిర్వహించనున్న కుంభోత్సవాన్ని ఆలయ సంప్రదాయాన్ని అనుసరించి శాస్త్రోక్తంగా నిర్వహిస్తాం. కుంభోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. క్షేత్ర పరిధిలో ఎక్కడ కూడా జంతు, పక్షి బలులు నిషేధించాం. ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. పోలీసు, రెవెన్యూ, దేవస్థాన అధికారులకు ప్రత్యేక విధులు కేటాయించాం. గురువారం రాత్రి నుంచి మూడు శాఖల అధికారులు గస్తీ నిర్వహిస్తారు. స్థానికులు ఊరి పండుగగా భావించే కుంభోత్సవానికి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి నిజరూప దర్శనం చేసుకుని తరించాలని సూచిస్తున్నాం.

– డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి

లారీ, టిప్పర్ సీజ్

కర్నూలు (న్యూటౌన్): అక్రమంగా గ్రానెట్ స్లాబ్ తరలిస్తున్న లారీ, రోడ్డు మెటల్ తరలిస్తున్న ఒక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ గురువారం విలేకరులకు తెలిపారు. ఒంగోలు జిల్లా బూదవాడ నుంచి ముంబయికి అక్రమంగా గ్రానెట్ స్లాబ్‌ను తరలిస్తున్న ఒక లారీని సీజ్ చేసి ఓర్వకల్లు పోలీస్ స్టేషన్‌లో ఉంచామన్నారు. అలాగే పాణ్యం మండలం తమ్మరాజు పల్లె నుంచి అక్రమంగా రోడ్డు మెటల్ తరలిస్తున్న ఒక టిప్పర్‌ను సీజ్ చేసి పాణ్యం పోలీస్ స్టేషన్‌లో ఉంచామన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం



మంటలకు దగ్ధమవుతున్న గడ్డివాములు

మద్దికెర: మండల కేంద్రంలోని కొత్తపల్లి రహదారిలో రైతులు పులికొండ, సోమలింగ, లింగన్న, మల్లి, రామకృష్ణలకు చెందిన ఆరు గడ్డివాములు గురువారం తెల్లవారుజామున దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు వాములుకు నిప్పు పెట్టినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. పశువుల కోసం నిల్వ చేసుకున్న గ్రాసం బుగ్గిపాలు కావడంతో దాదాపు రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. కాగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మద్దికెరకు చేరుకుని బాధితులను పరామర్శించారు. పూర్తి స్థాయిలో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సారా తయారీదారులపై పీడీ చట్టం

- ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: నాటుసారా తయారీ మానుకోకపోతే పీడీ చట్టం అమలు చేసి జైలుకు పంపుతామని ఎస్పీ కృష్ణకాంత్ హెచ్చరించారు. ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు బృందాలుగా ఏర్పడి గురువారం నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. కర్నూలు బంగారుపేటలో కేసీ కెనాల్ గట్టుపై ఉన్న నాటుసారా బట్టీలను ధ్వంసం చేసి 3,700 లీటర్ల నాటుసారా బెల్లం ఊట, 70 లీటర్ల నాటుసారాను ధ్వంసం చేశారు. ఇద్దరిని అరెస్టు చేసి 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. అలాగే పత్తికొండ సెబ్ స్టేషన్ పరిధిలోని పెండ్లిమానుతాండ, మద్రిమానుతాండ, మాన్‌సింగ్‌తాండలలో ఉన్న నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 5,200 లీటర్ల నాటుసారా బెల్లం ఊట, 100 లీటర్ల సారాను పారబోశారు. బట్టీలతో పాటు భూమిలో పాతిపెట్టిన ప్లాస్టిక్ డ్రమ్ములు, ప్లాస్టిక్ బిందెలు, నాటుసారా తయారీ సామాగ్రి, తదితర వాటిని కూడా గడ్డపారతో పెకిలించి సారా తయారీకి పనికి రాకుండా ధ్వంసం చేశారు. ఇళ్లల్లో రహస్యంగా దాచివుంచిన నాటుసారా ఊట, డ్రమ్ములను కూడా బయటకు తీసి పారబోశారు. సారా తయారు చేసినా, విక్రయించినా, ఇతర ప్రాంతాలకు రవాణా చేసినా చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని కర్నూలు సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్, డీటీఎఫ్ సీఐ నరసనాయుడు హెచ్చరించారు.



రహస్య ప్రాంతాల్లో ప్లాస్టిక్ బిందెల్లో దాచి ఉంచిన బెల్లం ఊటను చూపుతున్న సెబ్ పోలీసులు

అనంతపురం జిల్లా వృషభాల ప్రతిభ

వెల్దుర్తి(కృష్ణగిరి): రామళ్లకోట వనం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన బండలాగుడు పోటీల్లో అనంతపురం జిల్లా సీకే పల్లి వృషభాలు విజేతగా నిలిచాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి మాధవ స్వామి, ఆలయ కమిటీ చైర్మన్ చింతకాయల వెంకటేశ్వర్లు ప్రారంభించారు. మొదటి స్థానం సీకే పల్లి బచ్చల భాస్కరరెడ్డి వృషభాలు నిలవగా తర్వాతి స్థానాల్లో రుద్రవరం గోపాల్‌గౌడ్ వృషభాలు, బితాంద్రపాడు చిన్న రత్నం వృషభాలు, కలుగొట్ల రమేష్‌నాయుడు వృషభాలు, ఆలంకొండ మునిరంగడు వృషభాలు నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.50 వేలు, 40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులు అందజేశారు.



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మాధవస్వామి

ముగిసిన రంగనాథుడి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేకలంకరణలో తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీ రంగనాథునికి గురువారం తీర్థావళిని నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలికారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయం వద్ద వడపప్పు, పానకాలను భక్తులకు పంపిణీ చేశారు. రంగులబండిని కట్టి గ్రామస్తులు ఒకరిపై ఒకరు ఆనందంగా రంగులు చల్లుకుంటూ స్వామివారి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు. సాయంత్రం స్వామివారికి మహానైవేద్యం, మహామంగళహారతినిచ్చి అర్చకులు వేదమంత్రాల మధ్య స్వామివారి బ్రహ్మోత్సవాలను ముగించారు. స్వామివారికి తర్తూరులో బ్రహ్మోత్సవాలు ముగియటంతో శ్రీమహాలక్ష్మీదేవి అమ్మవారిని వివాహం చేసుకునేందుకు నెల్లూరు జిల్లా శ్రీరంగాపురానికి వెళ్లి అక్కడ అమ్మవారితో కల్యాణం చేయించుకుంటారని ఆలయ ఈఓ ఏడీవెంకటరమణ, ఆలయ ప్రదాన అర్చకుడు ఈశ్వరరెడ్డి తెలిపారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిసినా తర్తూరు జాతర మరో పదిరోజుల పాటు కొనసాగనున్నట్లు తెలిపారు.



శ్రీలక్ష్మీదేవి అమ్మవారు

తన్నుల సేవ.. కుడుములాట

- గులాబీ మయమైన చిన్నహోతూరు
- వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం
- ఆనందోత్సవాల మధ్య వసంతోత్సం



చిన్నహోతూరులో పార్వతి, పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



భక్తులను తన్నుతున్న వీరభద్ర స్వామి అవతారి

ఆస్పరి: సిద్ధరామేశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా గురువారం వైభవంగా చిన్నహోతూరు గ్రామంలో పార్వతీ, పరమేశ్వరుల కళ్యాణం, కుడుములు ఆట, నందికోలు సేవ, వీరభద్రస్వామి అవతారి తన్నుల సేవ, వసంతోత్సవం వైభవంగా జరిగాయి. ఆలయ ఆవరణలో భక్తుల జన సందోహం మధ్య పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కానుకలు సమర్పించుకున్నారు. పార్వతీ, పరమేశ్వరులను ఒక్కటి చేసేందుకు గ్రామస్తులు సంప్రదాయంగా ఆడే ఆటలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఇరు వర్గాలకు చెందిన పెద్దలు ఆడవేషంలో వున్న వ్యక్తిని శాంతింపజేస్తూ, అటు ఇటు తిప్పుతూ బుక్కు పిండిని ఒకరిపై ఒకరు వేసుకున్నారు. ఆ తరువాత ఇరువర్గాల వారు కుడుములతో ఆడుకున్నారు. ఇరు వర్గాల పెద్దలు పెళ్లి ఒప్పందం చేసుకున్నారు. అనంతరం పార్వతీ, పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించారు. పెళ్లి సమయంలో అలిగిన పార్వతీ దేవిని శాంతింప జేయడానికి పరమేశ్వరునిపై కుడుములు వేసి అవమానించారని గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఆ తరువాత ఆలయం దగ్గర వీరభద్ర స్వామి అవతారంలో వున్న పూజారి తలపై తట్ట పెట్టుకుని, త్రిశూలం చేత పట్టుకుని కేకలు వేసుకుంటూ భక్తులను తన్నుతూ తిరగడం ఆకట్టుకుంది. ఆయన తన్ను కోసం భక్తులు ఎగబడ్డారు. ఆయనతో తన్నించుకుంటే కోరిన కోర్కెలు వీరభద్రస్వామి తీర్చుతాడని భక్తుల నమ్మకం. అనంతరం ఉగ్రుడైన వీరభద్ర స్వామి అవతారిని గ్రామస్తులు మిరప కాయల పొగబెట్టి శాంతింపజేశారు. పార్వతీ, పరమేశ్వరుల పెళ్లి చేసే విషయంలో విఫలమయ్యారని వీరభద్ర స్వామి ఉగ్రుడై గ్రామ పెద్దలను ఇలా తన్నారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇదే ఆచారాన్ని ఇప్పటికి పాటిస్తున్నామన్నారు.

గులాజీ మయమైన గ్రామం

గ్రామస్తులు ఆనందోత్సవాల మధ్య వసంతోత్సవాన్ని జరుపుకున్నారు. గ్రామంలో అన్ని వర్గాల వారికి సంబంధించి ఆరు పెద్ద రంగుల గుంతలు ఉన్నారు. గుంతకో గులాబీ రంగుల కడవను ఆలయంకు తీసుకెళ్లి సిద్ధమేశ్వర స్వామికి పూజలు చేశారు. ఇక రంగుల వేసుకోవడం ఆలయం నుంచి మొదలు పెట్టారు. ఆతరువాత ఒక గుంత రంగు పూర్తి అయ్యేంత వరకు అక్కడే ఒకరిపై ఒకరు రంగులు వేసుకున్నారు. అలా ఒకటి తరువాత ఒకటి గుంతలలో ఉన్న రంగును పూర్తి చేస్తూ రంగులు వేసుకుంటూ గ్రామం అంతా తిరుగారు. మహిళలు, పిల్లలు సైతం ఒరిపై ఒకరు రంగులు వేసుకుని ఆనందోత్సవాలు మధ్య జరుపుకున్నారు. యువకులు రంగులు వేసుకుంటూ తప్పెట్లతో చిందులు వేశారు. పార్వతీ, పరమేశ్వరుల పల్లకీ సిద్ధ రామేశ్వర స్వామి ఆలయం చేరిన తరువాత వసంతోత్సవాన్ని ముగించారు. వసంతోత్సవంతో ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. కార్యక్రమంలో సర్పంచ్ హరిక్రిష్ణ, గ్రామ పెద్దలు మంజునాథ్‌గౌడ్, వీరభద్రగౌడ్, బసవరాజు పాల్గొన్నారు.



గ్రామం నడివీధిలోని గుంత వద్ద రంగులు చల్లుకుంటున్న గ్రామస్తులు

శరవేగంగా సోలార్ పార్క్ పనులు

పాణ్యం: కందికాయపల్లె గ్రామంలో సోలార్ పార్క్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 2023 ఆగస్టు 23వ తేదీన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ఈ పనులను ప్రారంభించారు. ఈ పరిశ్రమకు ప్రభుత్వం 2,500 ఎకరాలకు పైగానే భూమిని కేటాయించింది. ఇందుకు కోసం సోలార్ గ్రీన్ కో ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమ రూ. 4,500 కోట్ల మేర పెట్టుబడి పెట్టింది. పనుల్లో భాగంగా సబ్‌స్టేషన్ నిర్మాణం కూడా త్వరితగతిన పూర్తి చేయనున్నారు. ఈ పరిశ్రమతో పాటు విండ్ పవర్ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. సోలార్ పార్క్ ఏర్పాటుతో సమీప గ్రామాల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది.



కందికాయ పల్లె గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్యానెల్స్

మార్చి నెల విద్యుత్ బకాయిలు రూ.24 కోట్లు

- బిల్లుల చెల్లింపునకు ఐదు రోజులే గడువు

కర్నూలు(అగ్రికల్చర్): గృహ విద్యుత్ వినియోగానికి సంబంధించి మార్చి నెల విద్యుత్ బిల్లులు రూ.24 కోట్లు వసూలు కావాల్సి ఉందని విద్యుత్ శాఖ ఎస్ఇ ఉమాపతి తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మార్చి నెల గృహ విద్యుత్ బిల్లుల డిమాండ్ రూ.78 కోట్లు కాగా.. ఇప్పటి వరకు రూ.54కోట్లు వసూలయ్యాయన్నారు. ఎండలు, వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల గృహ విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని, బిల్లులు 20 శాతం వరకు పెరిగాయన్నారు. బిల్లుల చెల్లింపునకు ఈ నెల 30వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందన్నారు. ఈ నెల 28న ఆదివారం కూడా విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు తెరిచే ఉంటాయన్నారు.

ఖరీఫ్‌కు మరింత ‘పవర్’

- 132 కేవీ లైన్ సామర్థ్యం పెంపు
- 20 రోజుల్లో పూర్తి చేసేందుకు ప్రణాళికలు
- 2023-24లో 25 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు



గూడూరులోని 132 కేవీ సబ్ స్టేషన్

కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విద్యుత్ లైన్ సామర్థ్యాన్ని రూ.15 కోట్లతో పెంచుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2023-24లో 25 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చారు. ఆగస్టు నుంచి జనవరి వరకు వ్యవసాయ విద్యుత్ లోడ్ ఎక్కువగా ఉండనుంది. ఈ లోడ్‌ను తట్టుకునే విధంగా లైన్ సామర్థ్యాన్ని పెంచుతున్నారు. కర్నూలు కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపంలోని 220 కేవీ సబ్ స్టేషన్ నుంచి గూడూరు, ఎమ్మిగనూరు, మాధవరం(మంత్రాలయం) 132 కెవీ సబ్ స్టేషన్‌లకు 132 కెవీ లైన్ ఉంది. ఈ లైన్ సామర్థ్యం ప్రస్తుతం 70 మెగా వాట్స్ ఉంది. ఈ లైన్ ద్వారా 120 మెగావాట్స్ విద్యుత్ సరఫరా చేసేందుకు కార్బైడ్ ఫ్యాక్టరీ నుంచి గూడూరు వరకు 30 కిలోమటర్ల మేర పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టనున్నారు. ప్రస్తుతం ఉన్నప్యాన్కర్ లైన్ స్థానంలో ఏసీఎస్ఆర్ ప్యాన్కర్ కండక్టర్‌తో లైన్ వేయనున్నారు. మొత్తం 20 రోజుల్లో పనులు పూర్తి చేసే విధంగా యాక్షన్ ప్లాన్ సిద్ధమైంది. గూడూరు నుంచి మాధవరం వరకు ఇదివరకు ఉన్న లైన్ ఉంటుంది. భవిష్యత్తులో పెరిగే లోడ్‌ను బట్టి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఈ లైన్ సామర్థ్యం పెరిగితే వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ మరింత సమర్థవంతగా ఇచ్చే అవకాశం ఉంది.

విద్యుత్ శాఖపై ఎండల ప్రభావం

విద్యుత్ శాఖపై ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్‌లు నిరంతరాయంగా వినియోగిస్తుండటంతో గృహ విద్యుత్ వినియోగం ఇబ్బడిముబ్బడిగా పెరిగింది. వడగాల్పులు, ఎండల తీవ్రతకు ట్రాన్స్‌ఫార్మర్లు పేలడం, ఎస్‌జీ ఫీజులు, ఇతర ఎక్విప్‌మెంటు కాలి పోవడం వంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఇటీవలగూడూరులో ఓ ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. కర్నూలు ఎస్‌ఏపీ క్యాంపులో ఎస్‌జీ ఫీజులు కాలిపోయాయి. స్టాంటన్‌పురంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలి పోయింది. ఇటువంటి సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పెరుగుతున్న లోడ్...

ఎండలు, వడగాల్పుల తీవ్రత ఫలితంగా విద్యుత్ ఫీడర్‌లలో లోడ్ పెరిగిపోతోంది. దీంతో విద్యుత్ శాఖ యుద్ధప్రాతిపదికన లోడ్ డైవర్షిఫికేషన్ పనులు చేపడుతోంది. లోడ్ పెరిగిపోయిన ఫీడర్లలో ఒక కిలోమీటరుకు దాదాపు రూ.15 లక్షల వ్యయంలో డైవర్షిఫికేషన్ పనులు జరుగుతున్నారు. 2023 ఏప్రిల్ 19న కర్నూలులోని రేడియో స్టేషన్ ఫీడర్‌లో 126 యాంప్స్ లోడు ఉంది. ఈ నెల 19న ఇదే ఫీడర్‌లో 174.2 యాంప్స్‌కు లోడ్ పెరిగింది. ఇటువంటి ఫీడర్‌లు ఉమ్మడి జిల్లాలో అనేకం ఉన్నాయి. లోడ్ పెరుగడం వల్ల సమస్యలు ఉత్పన్నం కాకుండా డైవర్షిఫికేషన్ పనులు చేపట్టంతో సమస్యలను ముందస్తుగా నివారించుకున్నట్లు అవుతోంది.

సరఫరాలో అంతరాయం ఉండదు



వచ్చే ఆగస్టు నుంచి వ్యవసాయ విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతుంది. డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ ఇచ్చేందుకు రూ.15 కోట్లతో 132 కెవి లైన్ సామర్థ్యాన్ని పెంచుతున్నాం. వేసవి తీవ్రతకు ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర పరికరాలు కాలిపోతున్నాయి. ఇటువంటి సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా తక్షణం చర్యలు తీసుకుంటున్నాం. వేసవిలో ఫీడర్లలో లోడ్ పెరుగుతుండటంతో డైవర్షిఫికేషన్ పనులు ముమ్మరంగా చేస్తున్నాం.

– ఎం.ఉమాపతి, ఎస్ఈ, విద్యుత్ శాఖ